క్లుప్తంగా

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని గణేష్ నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. డ్రైనేజీ పొంగి రోడ్డు మీదకు రావడంతో దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన ఆదివారం సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పోశెట్టి గౌడ్, సంతోష్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలకు విచ్చేసిన సీఐ నర్సింహ, ఎన్‌వైకే అధికారి ఐజయ్య, రవీందర్‌రావు, కుమార్‌యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: నెహ్రూ యువకేంద్ర భారత ప్రభుత్వం రంగారెడ్డి శాఖ, శేరిలింగంపల్లి బ్లాక్, వివేకానంద యూత్ అసోసియేషన్ సంయుక్తంగా బాలకృష్ణ హైస్కూల్ మైదానంలో ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, జిల్లా ఎన్‌వైకే ఆఫీసర్ ఐజయ్య, ఎస్‌ఎస్‌డీ స్కూల్ చైర్మన్ రవీందర్ రావులు విచ్చేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు బాలకృష్ణ హై స్కూల్ కరస్పాండెంట్ పి. బాలకృష్ణ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌వైకే సభ్యులు కుమార్ యదవ్, అడ్వకేట్ నరేందర్ రెడ్డి, నర్సింగ్ యాదవ్, నర్సింహాచారి, ఆంజనేయులు, సురేష్, చాంద్ పాషా, రాజు సాయి, యువజన సంఘాల సభ్యులు, పాఠశాలల యాజమాన్యాలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ

రాయదుర్గం: సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్‌వన్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేయడం జరుగుతుందని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తర్వాత ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈ మెటీరియల్ పంపిణీ చేస్తామన్నారు. పదవ తరగతి చదివే విద్యార్థులు మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ముగ్గుల పోటీలు

మియాపూర్: మహిళల్లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మియాపూర్‌లోని సత్య కళ్యాణి అపార్ట్‌మెంట్, ఆల్విన్ కాలనీలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కాలనీ, అపార్ట్‌మెంట్‌ల నుండి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగురంగుల అందమైన ముగ్గులను వేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పట్టణీకరణ నేపథ్యంలో అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరిగి భారతీయ సంస్కృతి కనుమరుగవుతోందన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళా నాయకురాలు కస్తూరి, శ్రీదేవి, అంజలి, అసోసియేషన్ సభ్యులు వాణి, పట్టాభిరామ్, శ్రీనివాస్, అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బాంబే సర్కస్ ప్రారంభం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన గ్రేట్ బాంబే సర్కస్‌ను ఆదివారం మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్ ప్రారంభించారు. ఈ సర్కస్‌లో చైనా, రష్యా దేశాలకు చెందిన కళాకారుల విన్యాసాలు ఆకట్టుకుంటాయని తెలిపారు.

ఆమోదం లభిస్తేనే 'ఇల్లు'

- అర్హుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ కీలకం
- ప్రజాపాలన దరఖాస్తులే ప్రామాణికంగా కొనసాగుతున్న సర్వే
- ఈ నెలాఖరు లోగా పూర్తి చేసేందుకు చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు సంబంధించి ఇందిరమ్మ కమిటీలు కీలకంగా వ్యవహరించనున్నాయి. ఈ కమిటీ ఆమోద ముద్ర వేస్తేనే ఇళ్లు మంజూరు అవుతాయి. ఈ నేపథ్యంలోనే అర్హులైన ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌తో నగర శివారులోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో సంబంధిత సిబ్బంది సర్వే కార్యక్రమాన్ని చేపడుతోంది. పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులు, మున్సిపాలిటీలు, పురపాలక సంఘాలలోని వార్డులు/డివిజన్లలో వార్డు ఆఫీసర్లు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాల్సి ఉంటోంది. మొదటి దశలో అత్యంత పేదలను గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని సర్కారు భావిస్తోంది.

ప్రజా పాలన దరఖాస్తులే ప్రామాణికం

కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబరు 26 నుంచి జనవరి 6 వరకు ప్రజల నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించింది. ఈ దరఖాస్తుల ఆధారంగానే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసుకున్నారు. దరఖాస్తుల వివరాలను అధికారులు ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పురపాలక సంఘాల్లో ఇల్లు లేని వారి వివరాలు వార్డులు/డివిజన్ల వారీగా కనిపిస్తాయి. వీటి ఆధారంగా సర్వే బృందాలు క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నారు. ఇల్లు లేని వ్యక్తుల పూర్తి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటోంది.

ఇందిరమ్మ కమిటీ కీలకం

ఇళ్ల సర్వే అనంతరం వెల్లడైన జాబితాను ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పురపాలక సంఘాల్లోని వార్డులు/డివిజన్ల పరిధిలోని ఇందిరమ్మ కమిటీలకు అందజేస్తారు. కమిటీ సభ్యులు జాబితాలో ఉన్న వారి పేర్లను పరిశీలించి వారు అర్హులా? కాదా? అని నిర్ణయిస్తారు. కమిటీ ఆమోదించిన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తారు. ఇందులో సొంత స్థలం ఉండి అసలే ఇళ్లులేని పేదలకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. స్థలాలు లేని వారికి ప్రభుత్వం స్థలాలు కొనుగోలు చేసిన తర్వాత మరోసారి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు వివిధ దశల్లో అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.

కథనానికి స్పందించిన 'పీసీబీ'

నిధుల లేమితో నిలిచిన చెత్త!



సాక్షి ఎఫెక్ట్..

నిజాంపేట్: బాచుపల్లి సర్వే నెంబరు 186లోని డంపింగ్ యార్డులోని వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పరిసర కాలనీలు, బస్తీవాసులు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో ప్రచురితమైన 'నిధుల లేమితో నిలిచిన చెత్త' కథనానికి తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించారు. ఈనెల 20న పీసీబీ టాస్క్‌ఫోర్స్ అధికారులు బాచుపల్లిలోని డంపింగ్‌యార్డును సందర్శించి శ్యాంపిళ్లను సేకరించారు. చెత్తను పెద్దమొత్తంలో డంప్ చేయడం, కాల్చడంతో హిల్‌కౌంటీ, బాచుపల్లి, బండారి లేఅవుట్, ప్రగతినగర్ ప్రాంతాల ప్రజలు విషవాయువులతో ఉక్కిరిబిక్కిరవుతున్న విషయంపై గతంలోనూ ఈ మెయిల్స్, లిఖిత పూర్వకంగా పీసీబీకి ఫిర్యాదులు అందాయి. 2024 నవంబరు 28న పీసీబీ అధికారులు డంపింగ్ యార్డును సందర్శించారని, నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులకు కొన్ని మార్గదర్శకాలను సూచించినా పాటించలేదని చీఫ్ జాయింట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ జారీచేసిన ఉత్తర్వుల్లో ప్రస్తావించారు.

- సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2016ను చెత్త సేకరణ విషయంలో విస్మరించిందని, చెత్తను నిప్పు పెట్టిన సందర్భంలో మంటలు వ్యాపించకుండా ఫైర్ టెండర్ వెహికల్స్ ను కార్పొరేషన్ అధికారులు వినియోగించడం లేదని, ఈ విషయాన్ని జనవరి 28, 2024లో డంపింగ్‌యార్డును సందర్శించిన టాస్క్ ఫోర్స్ అధికారులు గుర్తించినట్లు పేర్కొన్నారు.
- వ్యర్థాలను జవహర్‌నగర్‌కు తరలించాలని ఆదేశించినా ఇంత వరకు వర్తింపజేయకపోవడంతో పరిసర ప్రాంతాల్లోని భూమి, నీరు, గాలి కలుషితమైందన్నారు.
- చెత్తను కాల్చడంతో ఈ(పీ) 1986 సెక్షన్ కింద అధికారులను ప్రాసిక్యూషన్ చేసే అవకాశం ఉందని ఉత్తర్వుల్లో వివరించారు.
- డంపింగ్ నిర్వహణ, రక్షణ చర్యలపై ఇంత వరకు నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు వార్షిక నివేదికను సమర్పించకపోవడంపై జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- బహిరంగ ప్రాంతాల్లో వ్యర్థాలకు నిప్పు పెట్టడంపై కార్పొరేషన్‌కు గతంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రూ.25 వేల జరిమానా విధించినా.. తీరులో మార్పు రాలేదన్నారు.
- సెక్షన్ 31 (ఏ) కింద ప్రివెన్షన్ ఆఫ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్ యాక్ట్ 1987 కింద నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులను మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట ప్రాసిక్యూషన్ చేసే అధికారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఉందని, ఈ చట్టం కింద ఉత్తర్వులు ఉల్లంఘించిన అధికారులకు ఏడాదిన్నర నుంచి 5 ఏళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.

కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

కుత్బుల్లాపూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో జీడిమెట్ల బస్ డిపో సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితంగా ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు వామపక్ష పార్టీలు ఐక్యంగా పోరాడుతాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంజయ్య, సత్యం, సీఐటీయూ నాయకులు శ్రీను, తిమ్మప్ప, దుర్గానాయక్, మల్లారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

'బేటీ సమ్మాన్–రెస్పెక్ట్ ద గర్ల్స్' కార్యక్రమంలో భాగంగా శ్రీచైతన్య పాఠశాల విద్యార్థినులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అవగాహన సదస్సుకు షీటీం సభ్యులు హాజరై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. –కూకట్‌పల్లి



మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి కృషి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ పీపీనగర్‌లో ఉన్న ఉర్దూ షాదీఖానాను మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌గా అభివృద్ధి చేయాలని కోరుతూ ఆదివారం సయ్యద్ రషీద్ ఆధ్వర్యంలో మైనారిటీలు వినతిపత్రం అందజేశారు. పీపీ నగర్‌లో 15వేల పైగా ముస్లిం కుటుంబాలు ఉన్నాయని, గతంలో కేటాయించిన 20 గుంటల ఖాళీ స్థలంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మిస్తే పేదలు శుభకార్యాలు నిర్వహించేందుకు ఉపయోగంగా ఉంటుందన్నారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి ఫంక్షన్ హాల్‌కు నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పీపీనగర్ ఉపాధ్యక్షుడు సయ్యద్ జహీరుద్దీన్, లాల్ మహ్మద్, హసన్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మిర్జా రషీద్ బేగ్, సంయుక్త కార్యదర్శి నుస్రత్, ఇబ్రహీం ఖాన్, సయ్యద్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

దాతల శిలా ఫలకం ప్రారంభం



దాతలతో పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్ కాలనీలోని సీతారామాంజనేయ దేవస్థానం అభివృద్ధికి లక్ష పైన విరాళం ఇచ్చిన దాతల వివరాలు శిలాఫలకంపై లిఖించారు. ఈ శిలా ఫలకాన్ని ఆదివారం పీఏసీ చైర్మన్ గాంధీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవ కోసం ఎంతో కొంత సాయం చేయాలన్నారు. కార్యక్ర మంలో ఘట్టమనేని వెంకటేశ్వరరావు, ప్రసాద్, హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మూర్తి, సెక్రటరీ గోపిచంద్, సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళాసిల్క్ చేనేత ప్రదర్శన



ఎగ్జిబిషన్‌లో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తున్నదని నిర్వాహకులు, సొసైటీ ప్రతినిధి వికాస్ జైన్ తెలిపారు. ఈ మేళాలో పోచంపల్లి, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, ధర్మవరం, చీరలు, కలంకారి చేనేత డ్రస్ మెటీరియల్, లక్నో చికెన్ వర్క్ కుర్తీస్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. యువతీ, యువకులకు నచ్చే విధంగా వస్త్ర ప్రదర్శనలో వివిధ వస్త్రాలు, వివిధ రకాల వస్తువులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. రాజస్థాన్ చీరలు, బెడ్ షీట్‌లు, వివిధ రకాల బొమ్మలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 13 వరకు ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఇళ్ల మధ్య ఓయో రూమ్‌లు వద్దు



ఓయో రూమ్‌లను తొలగిస్తానని కార్పొరేటర్‌కు హామీపత్రం అందజేస్తున్న యజమాని

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని న్యూ హెచ్ఐజీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులతో ఆదివారం డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ సమావేశం నిర్వహించారు. గతంలో నివాసాల మధ్య ఓయో రూమ్‌లు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుండటంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ వాసుల మధ్య సమావేశం నిర్వహించి ఓయో రూమ్‌ల యజమానిని పిలిపించి రూమ్‌లు తీసివేయాలన్నారు. దీంతో ఓయో యజమాని 15 రోజుల్లో రూమ్‌లు తొలగిస్తానని హామీ పత్రం అందజేశారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు కృష్ణారెడ్డి, కాలనీ వాసులు విజయ్‌కుమార్, శివకుమార్, సత్యనారాయణ, అన్నపూర్ణయ్య, పాండురంగారావు, సుదర్శన్ రెడ్డి, వేణుగోపాల్, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న బండి రమేష్ తదితరులు



చెక్కు అందజేస్తున్న గాలి బాలాజీ, నాయకులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ రాజు కాలనీకి చెందిన పి. మంజులకు రూ.33 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును ఆదివారం కుటుంబ సభ్యులకు పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అందజేశారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, నాయకులు నాగిరెడ్డి, లక్ష్మయ్య, ప్రవీణ్, మధు, సలీం, రమణ తదితరులు పాల్గొన్నారు.

టెంపుల్ బస్టాప్ వద్ద..

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీకి చెందిన కాకర భవిష్ తేజ్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కుటుంబ సభ్యులకు టెంపుల్ బస్టాప్ వద్ద కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు గాలి బాలాజీ, యువజన కాంగ్రెస్ నాయకుడు రాజేష్‌గౌడ్, మైనార్టీ నాయకులు ముఖ్దుం, నాయుడు, సాయి, భార్గవ్, షకీల్, రమణ, కాకర సాయిలు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో హెచ్‌సీయూ విద్యార్థుల సత్తా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రాయదుర్గం: యోగా పోటీలలో హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్–14 విభాగం యోగా సీఎం కప్ పోటీలలో క్యాంపస్ స్కూల్ నుంచి పాల్గొన్న 7వ తరగతి విద్యార్థిని వైష్ణవి రిథమిక్ యోగా విభాగంలో రంగారెడ్డి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో ఆమెను ఈనెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రిన్సిపల్ మురళి మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా వంటి వాటిల్లో కూడా రాణించేలా తర్ఫీదు ఇస్తున్నామన్నారు.పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఇతర అంశాలపై కూడా ఆసక్తి కనబర్చాలని సూచించారు.



యోగాసనం వేస్తున్న విద్యార్థిని వైష్ణవి

నీటి కొరతపై ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, స్థానికులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో సుమారు ఆరు నెలల నుంచి మంచినీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆదివారం గాయత్రినగర్ గాంధీ విగ్రహం వద్ద సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెసరి సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గాయత్రి నగర్‌లో కొన్ని నెలల నుంచి మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. సమయపాలన లేకుండా జలమండలి అధికారులు అలసత్వం, క్రిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో సరఫరా చేయటం, లో ప్రెషర్‌తో తక్కువ సమయంలో నీటి సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఎప్పుడు మంచినీరు సరఫరా చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. లో ప్రెషర్ ఉన్న ప్రాంతాల్లో హై ప్రెషర్‌తో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోజు విడిచి రోజు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి. సంజీవ్, కోశాధికారి వెంకటరమణ, పి. శ్రీనివాసరావు, సూరిబాబు, కాశీనాథ చారి, జితేంద్ర, ఉమా మహేష్, నాగేశ్వరరావు, గోపాల్ రెడ్డి, రాజు, సుబ్బారావు, దాసు, శ్రీనివాస్, నాయుడు, మహిళలు పాల్గొన్నారు.